
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.0

***

ANDHRAJYOTHY



నల్లగొండ

5

బుధవారం 10 జూలై 2024

ప్రాజెక్టుల నీటిమట్టం


| ప్రాజెక్టు | పూర్తిస్థాయి | ప్రస్తుతం | ఇన్‌ఫ్లో | అవుట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| | నీటి మట్టం (అడుగులు) | | (క్యూసెక్కులు) | |
| సాగర్ (టీఎంసీలు) | 590 (312.5050) | 503.40 (120.7372) | నిల్ | 800 |
| మూసీ (టీఎంసీలు) | 645 (4.46) | 637.49 (2.67) | 12.38 | నిల్ |
| పులిచింతల (టీఎంసీలు) | 175 (45.77) | 98.29 (0.64) | నిల్ | నిల్ |

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.212

# భౌ..భౌ కు భయపడేది లేదు

దేశవ్యాప్తంగా 2030 సంవత్సరం నాటికి శునకాల ద్వారా వచ్చే రేబిస్ నివారణ కోసం నేషనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ డాగ్ మీడియేటెడ్ రేబిస్ ఎలిమినేషన్ ఫ్రం ఇండియా (నాప్రే), రాష్ట్రంలో రేబిస్ నివారణకు షాప్రే ప్రణాళికలు రూపొందించాయి. కుక్క కాటుతో రేబిస్ సంక్రమించి ప్రజలు మృత్యువాతపడుతున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా ఈ ప్రణాళికలు రూపొందించాయి. ఇప్పటికే ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పశుసంవర్ధకశాఖ అధికారులతో పాటు వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ఇటీవల హైదరాబాద్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించి దీనికి సంబంధించిన విధి విధానాలను అధికారులకు వివరించారు. ఈ సమావేశం ఆధారంగా ఉమ్మడి జిల్లాలో సమావేశాలు నిర్వహించనున్నారు. పశుసంవర్ధకశాఖ పశుగణన ఆధారంగా గత ఐదేళ్లలో ఉమ్మడి జిల్లాలో 1.10లక్షకు పైగా పెంపుడు, వీధి కుక్కలు ఉన్నాయి.

- నల్లగొండ



నల్లగొండలో వ్యాక్సిన్ ఇస్తున్న పశువైద్యులు



- కుక్క కాటేసినా ఇకపై ఆందోళన అనవసరం
- రేబిస్ నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త కార్యాచరణ
- అందుబాటులో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ దోసులు
- పశుసంవర్ధక, వైద్య ఆరోగ్యశాఖ బాధ్యతలు
- 2030 నాటికి రేబిస్ రహిత ప్రాంతంగా మార్చడమే లక్ష్యం
- కుక్కలకు సాలిబుల్ చిప్‌లు

రేబిస్ నివారణకు జిల్లాలో 70వేలకు పైగా యాంటీరేబిస్ వ్యాక్సిన్ డోసులు సిద్ధంగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాలకు సరిపడా అందుబాటులో ఉంచారు. కొద్ది రోజుల క్రితం 1,500 పెంపుడు కుక్కలకు ఈ డోసులను ఇచ్చి లాంఛనంగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ డోసుల గడువు 2028 సంవత్సరం వరకు ఉంది. పెంపుడు కుక్కల యజమానులు స్వయంగా వచ్చి యాంటీరేబిస్ డోసులు వేయిస్తుండగా, వీధి కుక్కలతోనే అసలు సమస్య ఏర్పడుతోంది. మునిసిపాలిటీ సిబ్బందితో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది వీధి కుక్కలను పట్టుకువచ్చి కుటుంబ నియంత్రణ చేయించడంతో పాటు యాంటీరేబిస్ డోస్ కూడా వేయించే బాధ్యతను అప్పగించాలని యోచిస్తున్నారు. నల్లగొండలోని చర్లపల్లి వద్ద వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ చేసేందుకు ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్ ఉంది. ఇక్కడ ప్రతీరోజు 25 కుక్కలకు కుటుంబ నియంత్రణ చేసే అవకాశం ఉంది. అయితే వీధి కుక్కలను ఎక్కడ నుంచి తీసుకువచ్చారో తిరిగి అదే ప్రాంతంలో వదలాలనే నిబంధన ఉంది.

### జిల్లాకు ఒక యాంటీ రేబిస్ ల్యాబ్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేబిస్ నివారణకు జిల్లాకు ఒక యాంటీ రేబిస్ డయాగ్నస్టిక్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. ఈ విధంగా ఉమ్మడి జిల్లాలో మూడు ల్యాబ్‌లు రానున్నాయి. ఈ ల్యాబ్‌లలో యాంటీ రేబిస్ ఎలిమినేషన్‌పై పరీక్షలు నిర్వహిస్తారు. ఇదిలా ఉండగా వీధి కుక్కలు, పెంపుడు కుక్కలు కరిచిన తరువాత ప్రజలకు రేబిస్ వ్యాక్సిన్ ఇవ్వడానికి బదులు కుక్కలకే వ్యాక్సిన్ ఇస్తే అవి కరిచిన రేబిస్ రాకుండా ఉండేలా నాప్రే, షాప్రే ప్రణాళికలు రూపొందించాయి. ఈ నేపథ్యంలో పశుసంవర్ధకశాఖ, వైద్య ఆరోగ్యశాఖ యాంటీ రేబిస్ వ్యాక్సిన్, సిరమ్‌లపై ప్రజల్లో అవగాహన కల్పించాలని నిర్ణయించాయి. అవగాహన సమావేశాలు నిర్వహించడంతో పాటు కరపత్రాల ద్వారా అధికారులు ప్రచారం కల్పించనున్నారు. అందుకు ప్రజాప్రతినిధుల సహకారాన్ని కూడా తీసుకోవాలని నిర్ణయించారు. ప్రస్తుతం ప్రజల్లో అవగాహన కల్పించి 2025 సంవత్సరం నాటికి పూర్తిస్థాయి కార్యచరణకు దిగనున్నారు.

### కుక్కలకు సాలిబుల్ చిప్‌కు ప్రతిపాదన

ఉమ్మడి జిల్లాలోని మూడు జిల్లాలోని కుక్కలను గుర్తించేందుకు సాలిబుల్ చిప్‌ల ఏర్పాటుకు పశుసంవర్ధకశాఖ అధికారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఈ సాలిబుల్ చిప్ ఇంజక్షన్‌లోనే మిళితమై ఉంటుంది. కుక్క చెవి దగ్గర చిప్‌తో కూడిన డోస్‌ను వేసినట్లయితే ఆ కుక్క వివరాలన్నింటిని స్కాన్ ద్వారా గుర్తించవచ్చు. కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేసిన విధంగానే ఈ సాలిబుల్ చిప్ కూడా వ్యాక్సిన్ రూపంలో ఉంటుంది. వ్యాక్సిన్ వేసే సమయంలో సాలిబుల్ చిప్‌లో కుక్కకు సంబంధించిన వివరాలు ఏ ప్రాంతం, యజమాని ఎవరు అనేది నిక్షిప్తమై ఉంటుంది. యురోపియన్ దేశంలో ఇప్పటికే 20 ఏళ్లుగా ఈ సాలిబుల్ చిప్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇంజక్షన్ ఇచ్చిన చోట సాలిబుల్ రిగ్నేషన్ మిషన్ ఉంచితే ఆ కుక్కకు సంబంధించిన వివరాలు, రేబిస్ వ్యాక్సిన్ పండిందా లేదా కుటుంబ నియంత్రణ వివరాలు కూడా తెలుస్తాయి.

### కుక్కల్లో రేబిస్ నివారణకు కార్యచరణ



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు కుక్కల్లో రేబిస్ వ్యాధి నివారణకు నిర్ణయం తీసుకున్నాం. జిల్లా వైద్య ఆరోగ్యశాఖతో కలిసి రేబిస్ నివారణకు కార్యచరణ రూపొందిస్తున్నాం. త్వరలోనే ప్రజలకు అవగాహన కల్పిస్తాం. కరపత్రాలను పంపిణీ చేస్తాం. ప్రజలు, మునిసిపల్, గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి ఈ రేబిస్ నివారణకు ముందుకు సాగాలి. 2030నాటికి రేబిస్ నివారణ ప్రాంతంగా తీర్చిదిద్దుతాం.

- డాక్టర్ శ్రీనివాసరావు, పశుసంవర్ధకశాఖ నల్లగొండ జేడీ





# బడి ఊడ్చే దిక్కేది?

- స్కావెంజర్లు లేక అపరిశుభ్రంగా పాఠశాలల ఆవరణ
- పట్టించుకోని మునిసిపాలిటీలు, పంచాయతీలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

**సూర్యాపేటఅర్బన్, భువనగిరి టౌన్, జూలై 9:** ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లు లేక ఊడ్చేదిక్కులేదు. ఫలితంగా పాఠశాలల ఆవరణలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. గతంలో పాఠశాలల్లో ఊడ్చేందుకు, మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు ప్రభుత్వం స్కావెంజర్లను నియమించి వేతనాలు అందజేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్కావెంజర్లను, స్వీపర్లను తొలగించడంతో పాఠశాలలను శుభ్రంచేసే పరిస్థితి లేకుండా పోయింది.

స్కావెంజర్ల స్థానంలో మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీ సిబ్బందికి పాఠశాలల పారిశుధ్య పనులు అప్పగించింది. అయితే ఇప్పటికే పట్టణాలు, గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులు, పాఠశాలల్లో పనులు చేసేందుకు నిరాకరిస్తున్నారు. పాఠశాలల పనులను అదనపు బాధ్యతలుగా చూస్తున్న పారిశుధ్య కార్మికులు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఒత్తిడి చేసినప్పుడు మాత్రమే చుట్టపుచూపుగా వచ్చి పైపైన పనులు నిర్వహించి వెళ్తున్నారు. దీంతో పాఠశాలల్లో పారిశుధ్యం లోపిస్తోంది.

### కంపుకొడుతున్న మరుగుదొడ్లు

విద్యాసంవత్సరం ప్రారంభమై 40 రోజులు అవుతుండగా, పాఠశాలల్లో స్కావెంజర్లు లేక మరుగుదొడ్లు కంపుకొడుతున్నాయి. సూర్యాపేట జిల్లాలో గతంలో మొత్తం 753 మంది స్కావెంజర్లు పాఠశాలల్లో విధులు నిర్వహించేవారు. ప్రతీ 40 మంది విద్యార్థులకు ఒక స్కావెంజర్ ఉండేవారు. వారికి నెలకు గతంలో రూ.2,500 వేతనం ఇచ్చేవారు. వీరు పాఠశాల ప్రాంగణం, గదులు, మరుగుదొడ్లను శుభ్రం చేసేవారు.అయితే గత ప్రభుత్వం వారిని తొలగించి పాఠశాలల బాధ్యతలను మునిసిపల్, గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు అప్పగించింది. కొన్ని పంచాయతీల్లో పారిశుధ్య సిబ్బంది సరిపడా లేకపోవడం, ఉన్న సిబ్బంది అదనపు భారంతో పాఠశాలల్లో పనులకు ముందుకు రావడం లేదు.


### స్కావెంజర్లను నియమించాలి



రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో వెంటనే స్కావెంజర్లు, స్వీపర్లను నియమించాలి. గత ప్రభుత్వం వారిని తొలగించడంతో పాఠశాలల్లో పరిశుభ్రత లోపించింది. చెత్తాచెదారం పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెంది విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు.

- ఆవుల నాగరాజు, పీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

### పాఠశాలల పారిశుధ్య బాధ్యత స్థానిక సంస్థలదే



ప్రభుత్వ పాఠశాలల పారిశుధ్య బాధ్యత స్థానిక సంస్థలదే. ఈ మేరకు ప్రభుత్వం గతంలోనే ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామాల్లో పంచాయతీలు, పట్టణాల్లో మునిసిపాలిటీలు ప్రభుత్వ పాఠశాలల ఆవరణలను, మూత్రశాలలను శుభ్రం చేయాలి. ఇది అమలవుతోంది కూడా. అయితే కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు, మరికొన్ని పాఠశాలల్లో స్వచ్ఛంద సంస్థలు స్కావెంజర్లను నియమించి భృతి చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది.

- కె.నారాయణరెడ్డి, యాదాద్రి జిల్లా డీఈవో

### ఉమ్మడి జిల్లాలో 3,125 ప్రభుత్వ పాఠశాలలు

నల్లగొండ జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 1,126, ప్రాథమికోన్నత పాఠశాలలు 128, ఉన్నత పాఠశాలలు 229 వరకు ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో 690 ప్రాథమిక, 78 ప్రాథమికోన్నత, 162 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 930 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 65వేల మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. యాదాద్రి జిల్లాలో 712 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 39,760మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 2,790 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. స్కావెంజర్ల వ్యవస్థ పునరుద్ధరణపై నిర్ణయం తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినా నెరవేరలేదు.

## బాధితులకు సత్వర న్యాయం చేయాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



మహిళ పీఎస్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

**నల్లగొండ క్రైం, జూలై 9:** సమస్యలపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందించాలని పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని షీటీమ్, భరోసా సెంటర్, మహిళా పోలీస్ స్టేషన్లను ఎస్పీ తనిఖీ చేశారు. ఆయా ప్రాంతాల పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. మహిళ పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ తీరు, కేసుల నమోదు వివరాలను సీఐ కరుణాకర్, ఎస్ఐ ఎల్.విజయ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రభుత్వం మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, వారికి ఏ ఆపద వచ్చినా వెంటనే స్పందించి పోలీస్ శాఖ రక్షణగా ఉండాలన్నారు. ఎవరైనా ఆకతాయిలు వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా జన సమూహాలు, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, కళాశాలలు, మార్కెట్లు, షాపింగ్ మాల్స్‌తో పాటు ప్రతీ చోట నిరంతర పర్యవేక్షణ చేస్తూ లైంగిక వేధింపులు, ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు, యువతులు నేరుగా పోలీస్ స్టేషన్‌కు రాకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని డయల్ 100, క్యూఆర్ కోడ్, వాట్సాప్ లాంటి సామాజిక మాధ్యమాల ద్వారా కూడా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. మహిళలు ఎదుర్కొన్న వేధింపులపై జూన్ నెలలో 11 ఫిర్యాదులు వచ్చాయని, 8 పెట్టీ కేసులు, 31 అవగాహన సదస్సులు, 10 కౌన్సిలింగ్, 11 మందిని ఆకతాయిలను పట్టుకున్నామని, 145 హాట్ స్పాట్లను పోలీసులు సందర్శించారని ఎస్పీకి సీఐ వివరించారు. మహిళలు వారి సమస్యలపై జిల్లా షీ టీమ్ నెంబర్ 8712670235, ఎస్పీ 8712670200, షీటీమ్ సీఐ కరుణాకర్ 871267013 మిర్యాలగూడ ఇన్‌చార్జీ ఎస్ఐ కోటేష్ 8096004465 నెంబర్లకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. సమస్యలపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల పక్షాన నిలిచి వారికి తగిన న్యాయం చేసేలా చూడాలన్నారు. ఎస్పీ వెంట నల్లగొండ వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలను పూర్తి చేయాలి

సీఎస్ శాంతికుమారి




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్

**నల్లగొండటౌన్, జూలై 9:** ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలను పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. వనమహోత్సవం కార్యక్రమం కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. గతంలో నాటిన మొక్కల్లో చనిపోయిన వాటిని గుర్తించి కొత్తగా మొక్కలు నాటాలన్నారు. మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అందులో భాగంగా క్యాంటీన్లు, మీ-సేవా కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలో ప్రధాన ప్రదేశాల్లో మహిళా సంఘాలతో అమ్మ క్యాంటీన్లను ఏర్పాటు చేయించాలని సూచించారు. మహిళా సంఘాలకు అందించే రుణ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వానాకాలం సీజన్ ప్రారంభమై వర్షాలు కురుస్తున్నందున పంటల సాగు పెరుగుతుందని రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ జిల్లా స్థాయిలో పారదర్శకంగా నిర్వహించాలని, ప్రభుత్వ ఉత్తర్వులను కచ్చితంగా పాటించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు శ్రీనివాస్, పూర్ణచంద్ర, డీఆర్వో రాజ్యలక్ష్మి, జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీఆర్డీఏ నాగిరెడ్డి, జేడీఏ శ్రవణ్‌కుమార్, డీపీవో మురళి, డీఎంహెచ్‌వో కళ్యాణ చక్రవర్తి, ఐసీడీఎస్ పీడీ సక్కుబాయి పాల్గొన్నారు.



మెడికల్ కళాశాల పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి

### ప్రభుత్వ వైద్య కళాశాల పనులు పూర్తిచేయాలి : కలెక్టర్

ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులనుఏ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎస్ఎల్‌బీసీ వద్ద ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను ఆయన తనిఖీ చేశారు. నిర్మాణంలో ఇంకా ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే ముందే సరిచేసుకోవాలని, కమ్యూనిటీ మెడిసిన్ సెంటర్‌కు అవసరమైన హాల్ ఏర్పాటు చేయాలని సూచించారు. భవనం నిర్మాణ పనుల్లో జాప్యానికి కారణాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇసుక కారణంగా పనులు ఆలస్యమవుతున్నాయని వారు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, అవసరమైన ఇసుక సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, సాధ్యమైనంత త్వరగా భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలన్నారు. నెలాఖరు నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ నిత్యానంద్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజకుమారి, పలు విభాగాల అధిపతులు, ఉన్నారు.

## రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**మాడ్గులపల్లి, జూలై 9:** అసెంబ్లీ ఎన్నికల్లో సందర్భంగా రైతులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు జి.వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రైతులతోపాటు రైతు కూలీలందరికీ రైతు భరోసా పథకం వర్తింపజేయాలని, వారి ఖాతాల్లో నగదు జమ చేసి ఆదుకోవాలన్నారు. రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి 200 రోజులు గడుస్తున్నా నేటికీ ఈ హామీని కాంగ్రెస్ నెరవేర్చలేదన్నారు. రైతులకు బ్యాంకులు రుణం ఇవ్వకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి మోసపోతున్నారన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలాగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రైతులను మోసం చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు దశరథ, బొమ్మకంటి నరసింహ, చాడ యాదయ్య, కృష్ణారెడ్డి, జాన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీను, విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందేస్తున్న కిసాన్‌మోర్చ నాయకులు

## సాగర్‌డ్యాంను సందర్శించిన ట్రైనీ కలెక్టర్లు



సాగర్ ప్రధాన డ్యాంపై ట్రైనీ కలెక్టర్లు

**నాగార్జునసాగర్, జూలై 9:** తెలంగాణ క్యాడర్‌కు చెందిన ట్రైనీ కలెక్టర్లు మంగళవారం సాగర్‌డ్యాంను సందర్శించారు. తెలంగాణ దర్శన్‌లో భాగంగా సోమవారం వారు హైదరాబాద్ నుంచి సాగర్‌కు చేరుకోని బుద్ధవనాన్ని సందర్శించారు. మంగళవారం సాగర్ జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు ప్రత్యేక లాంచీలో వెళ్లి అక్కడి బౌద్ధ స్తూపాలు, నమూనాలను, మ్యూజియంను సందర్శించారు.

అనంతరం సాగర్ ప్రధాన డ్యాం, గ్యాలరీలను వీక్షించారు. సాగర్ డ్యాం ప్రత్యేకతలను, నాగార్జునకొండ విశేషాలను పర్యాటకశాఖ గైడ్ సత్యనారాయణ వారికి వివరించారు. వారి వెంట మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం నోడల్ అధికారి శ్రీనివాస్, జిల్లా పరిశ్రమల అధికారి కోటేశ్వర్‌రావు, ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ కృష్ణయ్య, విజయ విహార్ మేనేజర్ కిరణ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

## మా భూములను ఇప్పించండి

సాయిబండా తండా బాధితులు

**మర్రిగూడ, జూలై 9:** అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యవసాయ భూములను తిరిగి తమకు ఇప్పించాలని కుదాభక్షపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సాయిబండా తండా రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు పాండు,కారింగ్ యాదయ్య, కమలమ్మ, సోని, నర్సింహ మాట్లాడుతూ, సాయిబండా సమీపంలోని సర్వేనెంబర్ 34, 35, 38, 39, 40, 41,42,43,44,49,50లో 750ఎకరాల భూమిని 2005లో ఆకుల రాజయ్య తమను మోసం చేసి మ్యుటేషన్ చేసుకున్నాడని ఆరోపించారు. ఆ భూమిని 2006లో నెదురుమల్లి జనార్ధన్‌రెడ్డికి విక్రయించాడని, అతడు 2018లో దాసరి హనుమయ్యకు విక్రయించాడన్నారు. సుమారు 200మంది రైతులు 750ఎకరాల భూమిని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజయ్య పట్టా చేసుకున్న భూములకు నేటికీ రిజిస్ట్రేషన్ కాలేదని, ఆ భూములను తామే సాగు చేసుకుంటున్నామని, ధరణిలో సైతం తమ పేరునే భూమి ఉన్నందున పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాసరి హనుమయ్య 750 ఎకరాల భూమిలో 100ఎకరాలను రిజిస్ట్రేషన్ చేంయించుకున్నాడని తెలిపారు. ఈ విషయంపై హైకోర్టును ఆశ్రయించగా, విచారణకు ఆర్డీవో, తహసీల్దార్‌లకు ఆదేశాలు జారీ చేసిందన్నారు.భూములకు అధికారులు పట్టాలు ఇవ్వకుండా ఆన్‌లైన్‌లో లాక్ చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు






## అనుమతి గోరంత
# తవ్వేది కొండంత



**చింతపల్లి, జూలై 9:** నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలో మట్టి తరలింపు జోరుగా సాగుతోంది. అనుమతి కొంత వరకు తీసుకునే పెద్ద మొత్తంలో మట్టిని తరలిస్తున్నారు. వందలాది టిప్పర్ల ద్వారా అక్రమంగా ఒండ్రు మట్టిని తరలించి నిల్వలు చేస్తున్నారు. దేవరకొండ, పాల్వాయి, గుర్రంపోడు మండలంలోని ఘడియాగౌరారం, నసర్లపల్లి, కుర్మేడ్, వింజమూర్, తీదేడు(వెంకటంపేట), కుర్మపల్లితోపాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీలకు నిత్యం మట్టిని తరస్తున్నారు. టిప్పర్ల ద్వారా అక్రమంగా తరలిస్తుండటంతో రహదారులు పూర్తిగా ధ్వంసమవుతున్నాయి.

**అనుమతి లేకుండా నిల్వలు**

ఇటుక బట్టీలకు సంబంధించి వ్యవసాయ భూముల్లో భూమిని నాలాగా మార్చుకోవాలి. నాలాగా మార్చుకోకుండానే పలువురు ఇష్టారాజ్యంగా ఇటుక బట్టీలనుఏర్పాటు చేశారు. నాలాగా ఏర్పాటు చేస్తే రైతుబంధు వచ్చే అవకాశం ఉండదనే ఆలోచనతో ఇటుక బట్టీలు ఏర్పాటు చేస్తున్నారు.


**రహదారులు ధ్వంసం**



హైవేపై నిబంధనలకు విరుద్ధంగా టిప్పర్లు తరలిస్తుండటంతో రహదారులు పూర్తిగా ధ్వంసమవుతున్నాయి. ఇటుక బట్టీలు గ్రామాల మధ్యలో ఏర్పాటు చేయడం వల్ల వాహనాలు రాకపోకలవల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి.

● చల్లం పాండురాంగారావు, వీటీనగర్, చింతపల్లి మండలం








# వైద్యకళాశాలపై నీలినీడలు ?

● ఎల్‌వోపీ ఇవ్వని ఎన్ఎంసీ ● యాదాద్రి భువనగిరిలో ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభిస్తామంటున్న అధికారులు




బోధనాసుపత్రిగా గుర్తించిన యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రి

**భువనగిరి టౌన్, జూలై 9:** యాదాద్రి భువనగిరి జిల్లాకు మంజూరైన ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటుపై నీలి నీడలు అలుముకున్నాయి. వైద్యకళాశాల ఏర్పాటుకు అవసరమైన నియామకాలు, మౌలిక వసతులు తదితర కారణాలతో జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) కళాశాల ఏర్పాటుకు లెటర్ ఆఫ్ పర్మిషన్ (ఎల్‌వోపీ) ఇవ్వలేదని ప్రచారమవుతోంది. పైగా కళాశాల ప్రిన్సిపల్‌తోపాటు రాష్ట్ర వైద్యశాఖకు ఎన్ఎంసీ మెయిల్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో వైద్యకళాశాల ఏర్పాటుపై ఆశలు పెట్టుకున్న జిల్లావాసులు నిరాశకు గురవుతున్నారు. కానీ ఎన్ఎంసీ నిబంధనల మేరకు వైద్య కళాశాలకు, బోధనాస్పత్రికి అవసరమైన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు తదితర బోధనా వైద్యులు, సిబ్బంది నియామకాల ప్రక్రియ ప్రారంభమైందని అధికారులు పేర్కొంటున్నారు. ఉద్యోగుల బదిలీ గడువు ఈ నెల 20నాటికి పూర్తిస్థాయి వైద్యులు, తదితర సిబ్బంది నియామకాలు 100 శాతం పూర్తవుతాయని, కళాశాలకు అవసరమైన ల్యాబ్‌ల ఏర్పాటు ప్రారంభమైందని, ఈ నెల చివరన జరగనున్న రెండో విడత ఎన్ఎంసీ తనిఖీల నాటికి మొదటి తనిఖీల్లో చూపించిన లోపాలన్నింటినీ అధిగమిస్తామని అధికార యంత్రాంగం పేర్కొంటోంది. రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాలకు ప్రభుత్వ వైద్య కళాశాలలను గత ప్రభుత్వం మంజూరు చేయగా వివిధ శాఖలతో కూడిన బృందాల నివేదిక ఆధారంగా ఈ విద్యాసంవత్సరం నుంచి ఆ కళాశాలలు 50సీట్లతో ప్రారంభం కావాల్సి ఉంది. కానీ మొదటి దఫా తనిఖీల్లో తలెత్తిన అభ్యంతరాలతో ఆకళాశాలల ప్రారంభం అనుమానాస్పదంగా మారగా మిగతా ఏడు కళాశాలలతో నిమిత్తం లేకుండా తనిఖీ బృందాల అభ్యంతరాలను అధిగమించి ఈ విద్యాసంవత్సరంనుంచే భువనగిరిలో కళాశాలను ప్రారంభిస్తామని వైద్యకళాశాల టీం, జిల్లా పాలనాయంత్రాంగం దీమా వ్యక్తం చేస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు భువనగిరి కూత వేటు దూరంలో ఉండటమే కలిసొచ్చే అంశమని అధికార, రాజకీయ యంత్రాంగం పేర్కొంటుండటం గమనార్హం.

**మొదటి తనిఖీల్లో అభ్యంతరాలు**

వైద్య కళాశాల ఏర్పాటుపై ఎన్ఎంసీదే తుది నిర్ణయం. నూతనంగా ఏర్పాటు చేసే వైద్యకళాశాలలు, బోధనాసుపత్రులను ఎన్ఎంసీ నియమించే బృందాలు పలుమార్లు తనిఖీలు చేస్తాయి. మొదటి తనిఖీలో వెలుగు చూసిన లోపాలను మరుసటి తనిఖీ వరకు సవరించాల్సి ఉంటుంది. ఇలా 3, 4 పర్యాయాలు వేర్వేరు బృందాలు తనిఖీలు చేస్తాయి. చివరి తనిఖీ బృందం సమర్పించే నివేదిక మేరకు కళాశాలకు అనుమతులు ఇవ్వాలా?, తిరస్కరించాలా? అని ఎన్ఎంసీ నిర్ణయిస్తుంది. అయితే మొదటి తనిఖీ బృందం సంతృప్తికర నివేదిక అందజేస్తే కళాశాల ఏర్పాటుకు ఎన్ఎంసీ ఎల్‌వోసీ ఇస్తుంది. అయితే జూన్ 24న వచ్చిన మొదటి బృందం ఉదయం 9 నుంచి మరుసటి రోజు తెల్లవారుజాము వరకు వైద్యకళాశాల ఏర్పాటు చేయనున్న పాత కలక్టరేట్, బోధనాసుపత్రిగా గుర్తించిన జిల్లా ఆస్పత్రిలో తనిఖీలు చేసింది.

**కొరవడిన స్పష్టత**

తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలో ఉన్న జిల్లా ఆస్పత్రిని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)లోకి మారుస్తూ వైద్యకళాశాల అనుబంధ బోధనాస్పత్రిగా గుర్తించడంపై కొరవడిన స్పష్టత, తనిఖీల రోజే వైద్యకళాశాలలో బోధనా వైద్యులుగా పని చేసేలా అంగీకార పత్రాలు స్వీకరించడం, సరిపడా ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సరిపడా ఇతర వైద్యులు, నర్సింగ్ తదితర సిబ్బంది లేనట్టు, అలాగే ఇతర ఏర్పాట్లు, సదుపాయాలు కూడా ఆశించిన స్థాయిలో లేవని తనిఖీ బృందం ఎన్ఎంసీకి నివేదిక సమర్పించినట్టు ప్రచారమవుతోంది. అయితే ఓపీ సేవలు కాస్త మెరుగ్గానే ఉన్నప్పటికీ ఐపీ సేవలు ఇంకా పెరగాల్సి ఉందని, తనిఖీల సమయంలో జిల్లా ఆస్పత్రి వర్గాలు అందించిన ఓపీ, ఐపీ డేటాను హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం(హెచ్ఎంఐఎస్)తో ఎన్ఎంసీ పోల్చి చూసినట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుత 150 పడకల జిల్లా ఆస్పత్రిని 500 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ అవసరమైన భవన నిర్మాణం తదితర వసతుల కల్పనకు వైద్య ఆరోగ్యశాఖ రూ.168కోట్లను గతంలోనే మంజూరు చేసింది. కళాశాల ప్రారంభమైన వెంటనే ఆ నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యేలా కార్యాచరణ కూడా సిద్ధం చేసింది.

## ఈ నెల 20 నాటికి నియామకాలు

50 సీట్లతో ఏర్పాటు కాబోయే వైద్యకళాశాలలో 14 మంది ప్రొఫెసర్లు, 20 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 25మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు మొత్తంగా 59మంది ఫ్యాకల్టీ, అంతే స్థాయిలో ల్యాబ్ అసిస్టెంట్లు, నర్సింగ్, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉండాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతానికి కేవలం ప్రిన్సిపాల్ పోస్టును మాత్రమే ప్రభుత్వం భర్తీచేసింది. మరికొన్ని పోస్టులను ఇప్పటివరకు జిల్లా ఆస్పత్రిలో పని చేస్తున్న వైద్యులను సర్దుబాటు చేయాలని సంకల్పించారు. కానీ ఆశించిన స్థాయిలో నియామకాల కార్యాచరణ మొదటి విడత తనిఖీల నాటికి కొలిక్కి రాకపోవడం కూడా ఎల్ఓపీ రాకపోవడానికి ప్రధాన కారణమని పలువురు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో బదిలీల ప్రక్రియకు తెరలేపడంతో హైదరాబాద్‌కు సమీపంలో ఏర్పాటు చేస్తున్న వైద్యకళాశాలకు బదిలీపై రావడానికి పలువురు ప్రొఫెసర్లు, ఇతరులు ఆసక్తి చూపుతూ ఈపాటికే 17 మంది బదిలీపై వచ్చి విధుల్లో చేరినట్లు ఆస్పత్రి అధికారులు పేర్కొంటున్నారు. దీంతో బదిలీల గడువు ఈ నెల 20 ముగిసే నాటికి అవసరమైన ఫ్యాకల్టీ అంతా వస్తుందని, అదే సమయంలో వసతులు, సేవలపై వచ్చిన అభ్యంతరాలను ఈ నెల చివరన జరిగే రెండో విడత తనిఖీల నాటికి అధిగమించి ఎన్ఎంసీ నుంచి అనుమతులు సాధించి ఈ విద్యా సంవత్సరంనుంచే కళాశాలను ప్రారంభిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.













# రేషన్ బియ్యం పట్టివేత

● ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా తరలిన తెలంగాణ రేషన్ బియ్యం



కోదాడ మండలంలో రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

**కోదాడ రూరల్, జూలై 9:** తెలంగాణ రేషన్ బియ్యాన్ని ఆంధ్రాలో విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసి 40టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం లింగాల గ్రామానికి చెందిన నర్సింహారావు అనే వ్యక్తి తెలంగాణలోని వ్యాపారుల నుంచి రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేస్తున్నాడు. ఈ బియ్యాన్ని కాకినాడ పోర్టుకు తరలించి, అక్కడి నుంచి విదేశాలకు సరఫరా చేస్తున్నాడు. మూడు రోజుల క్రితం మండలంలోని కాపుగల్లు గ్రామం వద్ద మోపెడ్ క్వింటా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న సాంబశివరావు అనే వ్యక్తిని పోలీసులు పట్టుకుని, కేసు నమోదు చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఆంధ్రాలో కోటేశ్వరరావు అనే వ్యక్తికి విక్రయిస్తానని, కోటేశ్వరరావు వత్సవాయి మండలం లింగాల గ్రామానికి చెందిన నర్సింహారావుకు విక్రయిస్తాడని తెలిపారు. తెలంగాణ నుంచి రోజుకు కొన్ని వందల క్వింటాళ్ల బియ్యాన్ని నర్సింహారావు తన వాహనాల ద్వారా ఆంధ్రాకు రాత్రి వేళల్లో తరలిస్తుంటాడని పోలీసులకు సాంబశివరావు తెలిపాడు. దీంతో కోదాడ రూరల్ పోలీసులు, ఆంధ్రా పోలీసులతో కలిసి మంగళవారం వత్సవాయి మండలం లింగాల గ్రామంలో నర్సింహారావు ఇంట్లో తనిఖీ చేవారు. 1285బస్తాల్లో నిల్వ చేసిన 70 టన్నుల బియ్యాన్ని గుర్తించారు. వీటిలో తెలంగాణ రేషన్ బియ్యం 40టన్నులు, ఆంధ్రా రేషన్ బియ్యం 30టన్నులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని కోదాడ పోలీసులు సివిల్ సప్లై అధికారులకు అప్పగించారు. రేషన్ బియ్యం వ్యాపారులు నర్సింహారావు, కోటేశ్వరరావు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. కోదాడ ప్రాంతంలో అధికారుల అండదండలతోనే రేషన్ బియ్యం చెక్‌పోస్టులను దాటి ఆంధ్రాకు చేరుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**అక్రమంగా తరలిస్తున్న..**

**పాలకవీడు, మేళ్లచెర్వు:** అక్రమంగా తరలిస్తున్న 40క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. పాలకవీడు ఎస్ఐ లక్ష్మీనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం కోమటికుంట గ్రామం నుంచి జాన్‌పహాడ్ దర్గా వైపుగా వెళ్తున్న బొలేరో వాహనాన్ని పోలీసులు ఆపి తనిఖీ చేసి, 40క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు.డ్రైవర్ మునగ నర్సయ్య ప్రశ్నించగా ఏపీ రాష్ట్రం దాచేపల్లికి అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిపాడు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

**మేళ్లచెర్వు మండలం కందిబండలో..**

సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలంలోని కందిబండ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచి 3.5క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మేళ్లచెర్వు ఎస్ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కందికండ గ్రామంలో ఎస్కే జాన్‌బీ ఇంట్లో తనిఖీ చేసి అక్రమంగా నిల్వ చేసిన 3.5క్వింటాళ్ల రేషన్ బియ్యాన్న స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# బిల్లుల చెల్లింపుల్లో గోల్‌మాల్



నల్లగొండ జిల్లాకేంద్ర ఆస్పత్రి

- జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఇంప్లాంట్స్ మాయ
- ఒక ఉద్యోగికే మెటీరియల్ సరఫరా బాధ్యతలు
- బిల్లుల చెల్లింపుల్లో అవకతవకలు
- నిర్లక్ష్యం వహిస్తున్న ఆస్పత్రి అభివృద్ధి కమిటీ
- నాణ్యతలేని పరికరాలపై పర్యవేక్షణ కరువు

**ప్రభుత్వ సొమ్మును అప్పనంగా కాజేస్తున్నారు. రూ.లక్షలు అక్రమార్కుల చేతులు మారుతు న్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇంత జరుగుతు న్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో పలు అనుమానాలకు తావిస్తోంది.**

● నల్లగొండ

నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మోకాళ్ల చిప్పలతోపాటు ఆర్థోపెడిక్ సామగ్రి పంపిణీకి సంబంధించిన ఇంప్లాంట్స్ మాయాజాలం కొనసాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత రెండేళ్లుగా ఈ దందా సాగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆస్పత్రిలో అక్రమాలకు అడ్డూ అదుపులేకుండా పోయినప్పటికీ పర్యవేక్షణ కొరవడిందని సమాచారం. గత కొన్ని నెలల క్రితం బిల్లుల చెల్లింపు కోసం రూ.లక్షలు లంచంగా తీసుకుంటూ ఓ ఉన్నతాధికారి ఏసీబీకి చిక్కి నా ఆస్పత్రిలో అవినీతి అక్రమాలను మాత్రం నిలువరించ లేకపోతున్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మోకాళ్ల చిప్పల మార్పిడితోపాటు ఆర్థోపెడిక్ శస్త్ర చికిత్సల కోసం అవసరమైన ఇంప్లాంట్స్ కొనుగోలు విషయం లో రూ.లక్షలు చేతులు మారుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంతపెద్ద అవినీతి చోటు చేసుకున్నా, ఆస్పత్రి అభివృద్ధి కమిటీతోపాటు ఉన్నతాధికారులు కనీసం స్పందించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుందని ఆస్పత్రిలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈశస్త్ర చికిత్సలకోసం నాణ్యమైన ఇంప్లాంట్స్‌ను సరఫరా చేస్తున్నారా? లేక నాణ్యతలేనివి సరఫరా చేస్తున్నారా? అనేవి కూడా కనీసం పరిశీలన చేయకపోవడంతో సంబంధిత కంపెనీలది ఇష్టారాజ్యంగా మారింది.

**పట్టింపులేని అభివృద్ధి కమిటీ**

ఇంప్లాంట్స్ సరఫరాతోపాటు ఇతర కాంట్రాక్టు పనులు, నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులన్నింటికీ జిల్లా కేంద్ర ఆస్పత్రి అభివృద్ధి కమిటీ బాధ్యత వహించాల్సి ఉన్నా నిర్లక్ష్యం చేస్తుందన్న విమర్శలున్నాయి. టెండర్‌ను పర్యవేక్షించాల్సిన బాధ్యత అభివృద్ధి కమిటీదే అయినప్పటికీ అర్హతలు లేని వ్యక్తికి, సంస్థకు ఏవిధంగా ఇచ్చారని సంబంధిత ఆస్పత్రిలోనే కొంతకాలంగా చర్చ కొనసాగుతోంది. ఈ ఇంప్లాంట్స్‌ను సరఫరా చేస్తున్నది కంపెనీలో భాగస్వామా? లేదంటే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగా? అని కూడా చూడకుండా ఏ విధంగా టెండర్లను అప్పగించారని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఏసీబీకి పట్టుబడిన మాజీ అధికారికి సన్నిహితుడని తెలిసినప్పటికీ అర్హతలు లేకున్నా టెండర్ కట్టబెట్టడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. రెండేళ్లుగా సరఫరా అవుతున్న ఇంప్లాంట్స్ నాణ్యతపై పరిశీలన చేయడంతోపాటు బిల్లుల చెల్లింపు ఏ స్థాయిలో ఉంది, ఇందులో ఎవరి వాటా ఎంత ? ప్రభుత్వ ధనం ఏ స్థాయిలో వృథా అయిందనే దానిపై విచారణ చేస్తే అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయి. తెర వెనుక కొందరి పెద్దల హస్తం ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఖజానాకు గండి పడకుండా ఉండే విధంగా ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

**నేను బాధ్యతలు చేపట్టక ముందే పనులు ఇచ్చారు**

నేను బాధ్యతలు స్వీకరించక ముందే మోకాళ్ల చిప్పలు, ఆర్థోపెటిక్ ఇంప్లాంట్స్ సరఫరా బాధ్యతలను సదరు కంపెనీకి ఇచ్చారు. అవకతవకలు జరిగినట్లు నా దృష్టికి రాలేదు. అవకతవకలు జరిగితే శాఖా పరమైన చర్యలు తీసుకుంటాం. ఇంప్లాంట్స్ టెండర్ల ప్రక్రియను అభివృద్ధి కమిటీ చూసుకుంటుంది. నాణ్యమైన సామగ్రిని పరిశీలించి తీసుకుంటాం. ఎలాంటి అవకతవకలు, అవినీతి చోటు చేసుకోలేదు.

– డాక్టర్ నిత్యానంద, సూపరింటెండెంట్, జిల్లా కేంద్ర ఆస్పత్రి నల్లగొండ

పారకుల కూపీ

**అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిదే హవా**

గత కొన్నినెలల క్రితం లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని ఓ అధికారి తనకు సన్నిహితుడైన ఓవ్యక్తిని ఆస్పత్రిలోని ఓ విభాగంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా నియమించడంతోపాటు ఆ ఉద్యోగిని అడ్డం పెట్టుకొని తనకున్న పరపతితో గత రెండేళ్ల క్రితం ఇంప్లాంట్స్ పరికరాల సరఫరా బాధ్యతను అక్రమంగా టెండర్లలో అవకతవకలు సృష్టించి ఆ పనులు చేజిక్కించుకునేలా చేశారన్న ఆరోపణలున్నాయి. ఆ టెండర్ల విషయంలో అప్పట్లోనే విమర్శలు రావడంతో ఓ అధికారి దృష్టికి వెళ్లడంతో టెండర్‌ను రద్దుచేయాలని ఆదేశాలిచ్చారు. అయినప్పటికీ ఆ అధికారి ఆదేశాలను జిల్లా కేంద్ర ఆస్పత్రి అధికారులు బేఖాతారు చేసి టెండర్ల వివాదానికి కారకుడైన వ్యక్తికి ఇంప్లాంట్స్ సరఫరా బాధ్యతను అప్పగించడం గమనార్హం. గత రెండేళ్లుగా నాణ్యతలేని మోకాళ్ల చిప్పలు, ఆర్థోపెడిక్ ఇంప్లాంట్స్‌ను సరఫరా చేస్తూ రూ.లక్షల బిల్లులు కాజేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

## జోరుగా గంజాయి అక్రమ రవాణా

**అరకు నుంచి హుజూర్‌నగర్‌కు..**

**గంజాయి కేసులో ఆరుగురు నిందితుల అరెస్ట్**

**పరారీలో ఇద్దరు నిందితులు**


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ చరమంద రాజు

**హుజూర్‌నగర్, జూలై 9:** సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో గంజాయి తరలింపు కేసులో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ చరమందరాజు తెలిపా రు. మంగళవారం సీఐ చరమందరాజు తెలిపిన వివరా ల ప్రకారం.. పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఏర్పా టు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ హుజూర్‌నగర్‌కు చెందిన కొంతమంది యువకులు గంజాయిని రవాణా చేయడం, పీల్చడం చేస్తున్నట్లు తెలిపారు. పట్టణానికి చెందిన యువకులు వీరమళ్ల ఉపేందర్, షేక్ ర జి అప్రోచ్, మీసాల గోపి, చల్లా వికాస్, సయ్యద్ రహమద్ బాబా అలియాస్ సోహెల్, షేక్ బాల సైదా తుఫాన్‌సైదా అందరూ కలిసి గతనెల ఆంధ్రప్రదేశ్‌లోని అరకులోయ నుంచి గంజాయి కొనుగోలు చేద్దామని షేక్ రిజి అప్రోచ్ తనకు తెలిసిన నూకపంగు రాజుకు చెందిన వాహనం అద్దెకు తీసుకొని హుజూర్‌నగర్ నుంచి అరకులోయ వెళ్లారు. అక్కడ ఉపేందర్, చల్లా వికాస్, షేక్ రజి అప్రోచ్, సయ్యద్ రహమద్ బాబాసోహెల్‌కు రూ.20 వేలు ఇచ్చి ఓ గుర్తు తెలియని వ్యక్తి వద్ద ఐదు కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. కాగా గత నెల 27న హుజూర్‌నగర్‌కు వచ్చి సయ్యద్ రహమద్ బాబాసోహె ల్‌. ఉపేందర్, చల్లా వికాస్, షేక్ రజి అప్రోచ్‌లకు కొంత గంజాయి ఇచ్చి మిగతా గంజాయి మొత్తం తన వద్ద ఉంచుకొని, ఆ గంజాయిని విక్రయించి డబ్బులు ఇస్తానని చెప్పినట్లు సీఐ తెలిపారు. కాగా వారి వద్ద ఉన్న గంజాయిని మంగళవారం మధ్యాహ్నం తన సన్నిహితులైన పట్టణానికి చెందిన ఉమేష్‌లకు, లింగగిరిరోడ్డులో గల కాటమయ్య దేవాలయం వెనుక గంజాయిని విక్రయిస్తుండగా, పట్టణ ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి దాడులు చేసి ఆరుగురు నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు. ప ట్టుబడిన వారి నుంచి 235 గ్రాముల గంజాయి ఆరు సెల్‌ఫోన్లు, ఒక వాహనం స్వాధీనం చేసుకున్నారు. కే సునమోదుచేసి విచారణపూర్తిచేసి మంగళవారం కోర్టు లో ప్రవేశపెట్టినట్లు సీఐ తెలిపారు. గంజాయి తరలింపు కేసులో మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, త్వరలోనే పట్టుకుంటామన్నారు. యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ పిలుపినిచ్చారు. సమావేశంలో పట్టణ ఎస్ఐ ముత్తయ్య, ఏఎస్ఐ బలరాంరెడ్డి, కానిస్టేబుళ్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## చారిత్రక ఆనవాళ్లు మాయం

**శిథిలావస్థకు కాకతీయుల కాలంనాటి మెట్లబావులు**

**నాడు ప్రజల అవసరాలు తీర్చి.. నేడు ఆదరణ కరువు**


రాజాపేట మండలం బొందుగుల శివాలయంలోని మెట్ల బావి


సోమారం శివాలలయంలోని మెట్ల బావి

**రాజాపేట, జూలై 9:** చారిత్రక సాక్ష్యాలు కనుమరుగైపోతున్నాయి. నాడు ప్రజల అవసరాలు తీర్చిన నిర్మాణాలు నేడు కన్పించకుండా పోతున్నాయి. పురాతన కట్టడాలు, నిర్మాణాల పరిరక్షణను పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో కాకతీయుల కాలం నాటి మెట్లబావులు ఒకప్పుడు ఎన్నో గ్రామాలకు తాగునీటి అవసరాలు తీర్చేవి. కాకతీయుల కాలంలో ఆలయాల ఆవరణాల్లో మెట్ల బావులు నిర్మించి, దేవుడికి అభిషేకం, భక్తుల స్నానాలు, ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేవారు. రాజాపేట మండలంలోని బొందుగుల, సోమారం, భువనగిరి మండలం రాయిగిరి, ఆలేరు మండలం కొలనుపాకలో మెట్ల బావులున్నాయి. రాజాపేట మండలంలోని రేణుకుంటలో మెట్లబావిని ఎనిమిదేళ్ల క్రితం గ్రామస్థులు పూడ్చివేశారు. కాగా బొందుగుల, సోమారం గ్రామాల్లోని మెట్లబావులు నేటికీ నీటితో కళకళలాడుతున్నాయి. బొందుగులలోని మెట్లబావి ఐదు గుంటల విస్తీర్ణంలో ఉంది. కాకతీయుల కాలంలో నిర్మించిన ఈ మెట్లబావి అప్పటి సాంకేతిక నైపుణ్యతకు నిదర్శనం. పైనుంచి నీటి అడుగు భాగంవరకూ మెట్ల మార్గాన్ని నిర్మించారు. అదేవిధంగా కోనేరులో స్నానపు గదులు, దుస్తులు మార్చుకునే గదులు నిర్మించారు. కోనేరును రాయి, సున్నంతో నిర్మించి, ప్రత్యేక శిల్పాలు చెక్కించారు. నాడు ఎంతో ఉపయోగకరంగా ఉన్న మెట్ల బావులు నేడు చెట్లు చేమలతో పెరిగి శిథిలావస్థకు చేరి కళావిహీనంగా మారాయి. శిథిలావస్థకు చేరిన మెట్లబావులపై ప్రజల ఆదరణ తగ్గిపోయింది. నాటి సాంకేతికత, నిర్మాణ శైలిలో ఉన్న పాతకట్టడాలను చూసే భాగ్యం భావితరాలకు కనుమరుగవుతోందని చరిత్రకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మెట్ల బావులను కాపాడి ప్రాచీన కట్టడాల రక్షణకు నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**మెట్ల బావులను కాపాడాలి**



కాకతీయుల కాలంలో నిర్మించిన మెట్ల బావులు శిథిలావస్థకు చేరి కళావిహీనంగా మారుతున్నాయి. ప్రాచీనకట్టడాలను సంరక్షించేందుకు మరమ్మతులకోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. మెట్లబావులను మరమ్మతులు చేయించి పర్యాటక పాత్రంగా ఏర్పాటు చేయాలి.

– బొమ్మ కిషోర్, అర్చకుడు, బొందుగుల

## రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు బాలికల జట్టు ఎంపిక


జిల్లా బాలికల జట్టుతో అసోసియేషన్ అధ్యక్షుడు బండారు ప్రసాద్

**నల్లగొండ రూరల్, జూలై 9:** ఉమ్మడి నల్లగొండ జిల్లా సబ్ జూనియర్ బాలికల జట్టును ఎంపిక చేశారు. ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో క్రీడాకారులను ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు బండారు ప్రసాద్, చైర్మన్ గంట్ల అనంతరెడ్డి మాట్లాడుతూ ప్రతిభ కనబరిచిన 20మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని కల్వకుర్తి పట్టణంలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జట్టు పాల్గొంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఫుట్‌బాల్ ప్రతినిధులు ఓరుగంటి శ్రీనివాస్, హుస్సేన్, మట్టయ్య, సునీత, కోచ్‌లు దాస్, ప్రశాంత్, కుష్బూ, కరుణాకర్ పాల్గొన్నారు.

## పాముకాటుతో వ్యక్తి మృతి

**వలిగొండ, జూలై 9:** వ్యవసాయ పొలంలో గడ్డి కోస్తుండగా పాముకాటుకు గురైై వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం ఆసుపత్రిలో మృతి చెందాడు. ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాతాళ్లగూడెం గ్రామానికి చెందిన ఉద్దగిరి ఎల్లయ్య (60) వృత్తిరీత్యా వ్యవసాయదారుడు. సోమవారం తన వ్యవసాయ పొలంలో గడ్డి కోస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. వెంటనే కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం 108లో ఏరియా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ల సలహా మేరకు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎల్లయ్య సోదరుడు సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## శాంతి సమావేశం రేపు

**నల్లగొండ టౌన్, జూలై 9:** అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం (ఏఐపీఎస్‌వో) నల్లగొండ జిల్లా కమిటీ సమావేశాన్ని ఈ నెల 11న పట్టణంలోని టీఎన్‌జీవోస్ భవనంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు కట్ట వెంకట రెడ్డి మంగళవారం తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్ హాజరవుతారని చెప్పారు.

**నిత్యపూజా కైంకర్యాలు**



**ఉదయం 3.30 గంటలకు ఆలయాన్ని తెరుస్తారు**

**సుప్రభాతసేవ:** ఉదయం 3.30నుంచి4వరకు
**ఆరాధన:** 4-4.30 వరకు, **బాలభోగం:** 4.30-5.15వరకు
**నిజాభిషేకం:** 5.15 నుంచి 6.15 గంటల వరకు
**సహస్రనామార్చనలు:** 6.15నుంచి 7గంటల వరకు
**రాజభోగం:** 11.45నుంచి 12.30వరకు, మధ్యాహ్నం 3-4 వరకు ఆలయం మూసివేస్తారు.
**తిరువారాధన:** సాయంత్రం 7నుంచి7.45గంటల వరకు
**సహస్రనామార్చన:** రాత్రి 7.30నుంచి 8.15గంటల వరకు
**ఆరగింపు:** రాత్రి 9 గంటల నుంచి
**శయనోత్సవ దర్శనం:** 9.30- 9.45 ద్వార బంధనం
**ఉచిత దర్శనం:** ఉదయం 5 నుంచి 8 గంటల వరకు తిరిగి సాయంత్రం 5-7 రాత్రి 8.15-9 గంటల వరకు
**వీఐపీ వేళలు:** ఉదయం 9-10, సాయంత్రం 4-5వరకు..

భువనగిరి అర్బన్

**చెర్వుగట్టు ఆలయ వేళలు**



**ఉదయం:** 5.00 గంటలకు తెరుస్తారు
**సుప్రభాతసేవ మరియు నాదస్వరం:** ఉదయం 5.00 నుంచి 5.30 వరకు
**నిజాభిషేకం:** ఉదయం 5.30నుంచి 6.30గంటల వరకు
**దర్శనాలు:** ఉదయం 6.30గంటల నుంచి 12గంటల వరకు
**నివేదన:** మధ్యాహ్నం 12.00 గంటలకు మహానివేదన
**దర్శనం:** 12.10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు
**మూసివేత:** మధ్యాహ్నం ఒంటి గంటకు మూసివేత
**సాయంత్రం:** 3గంటలకు తెరుచుకోనున్న ఆలయం
**దర్శనాలు:** సాయంత్రం 3గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు దర్శనాలు
**ద్వార బంధనం:** సాయంత్రం 7.30 గంటలకు ప్రదోశకాల పూజలు మహా ఫల నివేదన, హారతి అనంతరం ద్వార బంధనం

## క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు


నిత్య కల్యాణ పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు

**భువనగిరి అర్బన్, జూలై 9:** గుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కొండపైన విష్ణు పుష్కరిణీ చెంత ఆంజనేయస్వామిని వేదమంత్రాలతో పంచామృతాభిషేకం జరిపిన అర్చకులు సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లి దళార్చనలు చేపట్టారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు ముఖ మండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచరాత్రాగమశాస్త్రరీతిలో నిర్వహించారు. అనుబంధ పాతగుట్ట ఆలయం, విష్ణుపుష్కరిణి, కొండపైన శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.19,91,286 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ముస్తఫా



**నల్లగొండ టౌన్, జూలై 9 :** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నల్లగొండ మండలం ముషంపల్లి గ్రామానికి చెందిన షేక్ ముస్తఫా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర చైర్మన్ చీమశ్రీనివాస్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియమానికి సహకరించిన సంఘం నాయకులకు ముస్తాఫా కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

## ఎమ్మార్పీఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు


వెంకటేశ్వర్లుకు నియామక పత్రం అందజేస్తున్న గణేష్

**హాలియా, జూలై 9:** ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ముదిగొండ వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చేకూరి గణేష్‌మాదిగ మంగళవారం నియామక పత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన సంఘం నాయకులకు వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలియజేశారు. ఉమ్మడి జిల్లాలో సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

## జేఎల్‌లో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంక్ సాధించిన శ్రీను



**తిరుమలగిరి(సాగర్), జూలై 9:** ఇటీవల టీజీపీఎస్సీ వెలువడిన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని కొంపెల్లి గ్రామానికి చెందిన ఎనమల్ల శ్రీను మల్టీజోన్ -2లో హిస్టరీ విభాగంలో మొదటి ర్యాంక్ సాధించాడు. ఇటీవలే వెలువరించిన గురుకుల డీఎల్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు సాధించినట్లు శ్రీను తెలిపాడు. 8సార్లు నెట్, సెట్ క్వాలిఫై అయినట్లు ఉస్మానియా యూనివర్సిటీలో హిస్టరీ విభాగంలో ఇటీవల పీహెచ్‌డీ పూర్తి చేశాడు.

## కులదూషణ కేసుపై విచారణ

**అడ్డగూడూరు, జూలై 9:** యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల కేంద్రంలో ఇటీవల నమోదైన కులదూషణ కేసుపై భువనగిరి ఏసీపీ రవికిరణ్‌రెడ్డి విచారణ చేపట్టారు. మండలంలోని లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన నారగోని అంజయ్య, మండల కేంద్రానికి చెందిన బాలెంల విద్యాసాగర్‌ను కులంపేరుతో దూషించారని విద్యాసాగర్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. కాగా మంగళవారం ఏసీపీ రవికిరణ్ రెడ్డి మండలకేంద్రంలో బహిరంగ విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారుడు బాలెంల విద్యాసాగర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్ఐ నాగారాజు ఉన్నారు.

# వలస బాట..ఉపాధి వేట

- జిల్లాకు వలసొస్తున్న కూలీలు
- ఆంధ్రప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ నుంచి రాక
- పొరుగు రాష్ట్రాల కూలీలకు చేతినిండా పనులు


రైతు పొలంలో నారు పంచుతున్న కూలీలు



**మోటకొండూరు, జూలై 9:** పొరుగు రాష్ట్రాల కూలీలు పొట్ట చేతపట్టుకొని వందల మైళ్ల దూరాన్ని దాటుకుంటూ యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలానికి వలస వస్తున్నారు. గత మూ డేళ్లుగా వర్షాలు కురుస్తుండడంతో మండలవ్యాప్తంగా వ్యవసాయ సాగు మరింతపెరిగింది. ఈ సీజన్‌లో వర్షాలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యా రు. దీనికితోడు స్థానిక కూలీల కొరత ఏర్పడింది. అదును దాటకముందే వరినాట్లు వేయాలన్న ఉద్దేశంతో రైతులు గత ఏడాది మాదిరిగానే ఈ సీజన్‌లో పత్తిలో కలుపు తీయడం, అడుగు మందు వేయడం, వరి నాట్లు వేసేందుకు ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, బీహార్ రాష్ట్రాల నుంచి సుమారు 400 మంది వలస కూలీలు మోటకొండూర్, సికిందర్‌నగర్, అమ్మనబోలు, పెద్ద బావి, సాకంపల్లి, తేర్యాల, చామాపూర్, చందేపల్లి గ్రామాలకు వచ్చి వ్యవసాయ పనుల్లో చేరడంతో పనులు జోరందుకున్నాయి.


**రేకుల షెడ్డులే నివాసాలు**

వలస కూలీలకు గ్రామాల్లో ఉన్న రేకుల షెడ్డులే నివాసాలుగా మారాయి. కొంతమంది పొలాల మధ్య ఉన్న చెట్ల కింద గుడిసెలు వేసుకొని అక్కడే ఉంటున్నారు. తమకు కావాల్సిన నిత్యావసరాలను కూలీలే సమకూర్చుకుంటున్నారు. అందులో ఇద్దరు వంటలు చేస్తారు. వంట పని ముగియగానే అంతా కలిసి భోజనం చేసిన తర్వాత పనులకు వెళుతున్నారు. స్థానిక కూలీలకంటే వలస కూలీలు పత్తి, వరినాట్ల పనులను గంపగుత్తకు తీసుకొని అనుకున్న సమయానికంటే ముందుగానే పనులను పూర్తిచేస్తున్నారు. దీంతో కూలీల ఖర్చు తగ్గడంతోపాటు పనులు సకాలంలో పూర్తవుతుండడంతో రైతులు వలస కూలీలవైపే మొగ్గు చూపుతున్నారు.

**గ్రూపులుగా ఏర్పడి..**

వరినాట్లు వేసేందుకు వలస కూలీలు గ్రూపులుగా ఏర్పడి తెల్లవారుజామునే పంట పొలాల్లోకి వెళుతున్నారు. 15మంది కూలీలు కలిసి ఒక గ్రూపుగా ఏర్పడి ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఐదు ఎకరాలు పూర్తి చేస్తున్నారు. అందులో ముగ్గురు నారు పంచడం, మిగతావారు నాట్లు వేయడంతోపాటు ఎరువులు సైతం చల్లుతున్నారు. పత్తి పంటలో కలుపు మొక్కలు తీయడంతోపాటు పత్తి మొక్కల మొదలు వద్ద యూరియా, పైమందు పిచికారీ చేస్తున్నారు.


**రెండేళ్లుగా వలస కూలీలతోనే పనులు**



నాకున్న ఎకరంతోపాటు కౌలుకు చేస్తున్న 20 ఎకరాల్లో వరి నాట్లు వేయాల్సి ఉంది. అందులో ఇప్పటివరకు ఏడు ఎకరాల్లో ఎతారాల్లో నాట్లు వేశాను. మిగతా 14ఎకరాల్లో వరినాట్లు వేయిస్తున్నా. గత రెండేళ్లుగా వలస కూలీలతో వరినాట్లు వేయిస్తున్నా. దీనికితోడు కూలీల ఖర్చు తగ్గడంతోపాటు అదును దాటకముందే వరినాట్లు పూర్తవుతున్నాయి. దీంతో అనుకున్న సమాయనికి వరిపంట చేతికి వస్తుంది.

– సంగు శేఖర్, రైతు, మోటకొండూర్

**పనుల కోసం వలస**



మా దగ్గర పనులు దొరక్కపోవడంతో ప్రతీ ఏటా మోటకొండూర్, సికిందర్‌నగర్ తోపాటు పలు గ్రామలకు వచ్చి వరినాట్లు, పత్తి తీయడం పనులు చేస్తుంటాం. రెండు నెలలు వరినాట్లు, రెండు నెలలు పత్తితీయడంతోపాటు ఏటా రెండు సీజన్లలో నాలుగు నెలలు ఇక్కడే ఉండి సంపాదించుకుంటున్నాం.ఇప్పటివరకు సమారు 400మందివలస కూలీలు ఇక్కడకు వచ్చారు. ఇక్కడి రైతులతో మాకు ఎలాంటి ఇబ్బందుల్లేవు.మమ్మల్ని ఇక్కడి రైతుల మాదిరిగానే చూసుకుంటున్నారు.

– చెన్నయ్య, వలస కూలీ, మురారిపల్లి, ఎర్రగొండపాలెం, ప్రకాశం జిల్లా

## శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి




అడవిదేవులపల్లిలో కరపత్రాలు విడుదల చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

**అడవిదేవులపల్లి, పెద్దవూర, దామరచర్ల, జూలై 9:** నకిరేకల్‌లో ఈ నెల 13, 14, 15వ తేదీల్లో నిర్వహించే ఎస్‌ఎఫ్‌ఐ జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగ తులను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర సైదానాయక్ కోరారు. మంగళవారం మండలకేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయా లన్నారు. కార్యక్రమంలో స్వామినాయక్, రవి, సిపాయి, కల్యాణ్, గిరి, కావ్య, ప్రసన్న, కవిత, మురళీకృష్ణ పాల్గొన్నారు. పెద్దవూరలో ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కోరె రమేష్ కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రవి, శివాని, కావ్య, రాజేష్, చందు, సాయి, నాగ పాల్గొన్నారు. దామరచర్లలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర సైదానాయక్ కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీరన్ననాయక్, నరసింహ, హుస్సేన్, సిపాయి, రవి, అనిల్ ఉన్నారు.

## చండూరులో మేకల దొంగల కలకలం

**చండూరు, జూలై 9:** చండూరు పట్టణంలో సోమవారం పట్టపగలే దొంగలు మేకలు అపహరించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణానికి చెందిన చంద్రం, అన్నెపర్తి యాదగిరి తోపాటు మరికొంత మంది తమ ఇంటి ఆరు బయట కట్టేసుకున్న మేకలను చూస్తుండగానే పట్టపగలు గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి అపహరించినట్లు బాధితులు తెలిపారు. పట్టణంలో ఆరు నెలల నుంచి ఇలాంటి దొంగతనాలకు పాల్పడుతున్నారని, ఆరు నెలల్లో సుమారు 50కి పైగా మేకలు అపహరణకు గురైనట్లు బాధితులు తెలిపారు. సీసీ పుటేజీల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

**దేవరకొండ, జూలై 9:** ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వస్కుల సత్యనారాయణ కోరారు. మండలంలోని కట్టకొమ్ముతండాలో ఉచిత కంటి వైద్యశిబిరం, బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించే కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దేవరకొండ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 150మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 20 మందికి శస్త్ర చికిత్స కోసం హైదరాబాద్ పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి సముద్రాల ప్రభాకర్, నిరంజన్, వనం బిక్షమయ్య, గాజుల రాజేష్, హరి, మాజీ సర్పంచ్ సేనావత్ శివయ్యనాయక్ పాల్గొన్నారు.

## ధర్నాను విజయవంతం చేయాలి : సీఐటీయూ

**దామరచర్ల, జూలై 9:** కార్మికుల కోరికల దినంగా పాటించి ఈ నెల 10న నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ భైరం దయానంద్ అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పది సంవత్సరాల్లో కార్మికుల వ్యతిరేక విధానాన్ని అవలంబించిందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయకుండా కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మహేశ్వరి, మండల కార్యదర్శి జయమ్మ, చంద్రకళ, అచ్చాలు, మంగ లక్ష్మీ, సంతోష్, కలమ్మ, జానకి పాల్గొన్నారు.

## మూసీ ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయాలి

**కేతేపల్లి, జూలై 9:** మూసీ కుడి, ఎడమ కాల్వల ఆయకట్టు భూముల్లో వానాకాల పంటల సాగుకు నీటిని అందించాలని కేతేపల్లి మాజీ జడ్పీటీసీ కోట మల్లికార్జునరావు కోరారు. మండలకేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 637అడుగుల మేర నీరు నిల్వ ఉన్న నేపథ్యంలో ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తే రైతులు వరి నార్ల పెంపకం చేపడతారన్నారు. మున్ముందు అధిక వర్షాలు వస్తే వరద నీటిని దిగువ మూసీకి వృథా విడుదల చేయకుండా ఉండే వీలుంటుందన్నారు. ఈ దిశగా మూసీ అధికారులు దృష్టిసారించి ఆయకట్టు రైతులకు మేలు జరిగేలా చూడాలన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన శాలిగౌరారం సీఐ, ఎస్ఐ



సీఐ కొండల్‌రెడ్డి, ఎస్ఐ సైదులు

**శాలిగౌరారం, జూలై 9:** శాలిగౌరారం సీఐ కె. కొండల్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్ జోన్‌కు బదిలీ అయ్యారు. హైదరాబాద్ నుంచి కొండల్‌రెడ్డి బదిలీపై శాలిగౌరారం సీఐగా వచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని సీఐ కోరారు. అదేవిధంగా శాలిగౌరారం ఎస్ఐగా డి. సైదులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన దేవరకొండ నుంచి శాలిగౌరారం ఎస్ఐగా బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ప్రవీణ్‌కుమార్‌పై వచ్చిన ఆరోపణలతో నల్లగొండ ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

## జడ్పీ స్టడీ సెంటర్ విద్యార్థుల ప్రతిభ

**నల్లగొండ టౌన్, జూలై 9:** ఇటీవల విడుదలైన గ్రూప్-1 ప్రిలిమినరి పరీక్షా ఫలితాల్లో జిల్లాకేంద్రంలోని జడ్పీ స్టడీసెంటర్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. స్టడీసెంటర్‌కు చెందని 14మంది అభ్యర్థులు మెయిన్స్‌కు అర్హత సాధించారు. అదేవిధంగా తెలంగాణ పబ్లిక్ కమిషన్ విడుదల చేసన జనరల్ జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో కూడా ప్రతిభ సాధించి ఉద్యోగాలు పొందారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



డ్రమ్ముల్లో నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది

**దామరచర్ల, జూలై 9:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరి చేరవని మండల వైద్యాధికారి నాగేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని నర్సాపురం గ్రామంలో గ్రామస్థులు విష జ్వరాల బారిన పడడంతో గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జ్వరపీడితుల నుంచి రక్త నమూనాను సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. రిపోర్ట్ వచ్చిన తర్వాత రోగులకు మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. వైద్యారోగ్య సిబ్బంది గ్రామాల్లోని ఇంటింటికి వెళ్లి నిల్వ ఉన్న నీటిని తొలగించినట్లు తెలిపారు. నీటి నిల్వ వల్ల దోమలు వృద్ధి చెందిన డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తాయని తెలిపారు.

## చికిత్సపొందుతూ యువతి మృతి

**మాడ్గులపల్లి, జూలై 9:** గడ్డి మందు తాగిన యువతి చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ సంఘటన మండలంలోని కుక్కడం గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యువతి(20) మూడు రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే నల్లగొండలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. యువతి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

## ఘర్షణలో గాయపడిన వ్యక్తి..

**మిర్యాలగూడ రూరల్, జూలై 9:** మండలంలోని యాద్గార్‌పల్లిలో రెండు రోజుల క్రితం జరిగిన ఘర్షణలో గాయపడిన వస్కుల జనార్ధన్(34) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొద్ది రోజుల క్రితం యాద్గార్‌పల్లిలో ముల్కలపల్లి సంతోష్, కుంచం విక్రమ్ గొడవపడ్డారు. ఈ విషయంలో గ్రామానికి చెందిన వస్కుల జనార్ధన్ సంతోష్‌కు మద్దతుగా మాట్లాడడంతో మనసులో పెట్టుకున్న విక్రమ్ జనార్ధన్‌పై కక్ష పెంచుకున్నాడు. జూలై 7న రాత్రి జనార్ధన్ కిరాణ దుకాణానికి రాగా విక్రమ్, అతని తల్లి ఎల్లమ్మ, తండ్రి శ్రీను, తమ్ముడు అజిత్ కలిసి దాడి చేశారు. తీవ్ర గాయాలపాలైన జనార్ధన్‌ను కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడు.

# సమ్మె చేశారు.. అధికారులు కదిలారు

- చండూరులో తొమ్మిది రోజులుగా పారిశుధ్య కార్మికుల సమ్మె
- కుటుంబ పోషణ కష్టంగా మారిందని ఆవేదన
- పట్టణంలో పేరుకుపోయిన చెత్తాచెదారం
- అధికారులు, ప్రజాప్రతినిధుల హామీతో విరమణ





చండూరులోని ప్రధాన చౌరస్తాలో పేరుకుపోయిన చెత్తచెదారం, సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటిస్తున్న కార్మికులు

**చండూరు, జూలై 9:** చండూరు మునిసిపాలిటీలో పారిశుధ్య కార్మికులు సమ్మె బాట పట్టారు. నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకుంటే తమ కుటుంబాలు ఎలా గడుస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు జూలై 1వ తేదీ నుంచి తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తుండడంతో పట్టణంలో చెత్తా, చెదారం పేరుకుపోయి, డ్రైనేజీలు నిండిపోయాయి. సమ్మెతో 10 వార్డుల్లో ఇళ్ల నుంచి చెత్త సేకరణ కూడా నిలిచిపోయింది. మురుగు నీరు రోడ్లపైకి వస్తుండడంతో దుర్గంధంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తమకు 12 నెలలుగా పీఎఫ్, ఈపీఎఫ్ జమ కావడం లేదని కార్మికులు ఆరోపించారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిమార్లు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని, తప్పని పరిస్థితుల్లో సమ్మెకు దిగామని పారిశుధ్య కార్మికులు తెలిపారు. సకాలంలో జీతాలు ఇవ్వకపోవడంతో కుటంబాలు గడవడం లేదని, వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మునిసిపల్ కార్యాలయం ఎదుట టెంట్ వేసుకొని సమ్మె చేస్తున్నారు. దీంతో మునిసిపల్ కమిషనర్ వెంకటమణికరణ్ సమ్మె చేస్తున్న కార్మికులతో మంగళవారం మాట్లాడారు. సమ్మె విరమించి విధుల్లో చేరాలని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కేవలం జూన్ నెల జీతం మాత్రమే చెల్లించాలని, మిగితా మూడు నెలల జీతం మంగళవారమే వారి ఖాతాల్లో జమ చేశామని కమిషనర్ తెలిపారు. తమకు ఎప్పటి వరకు జీతాలు చెల్లిస్తారో రాతపూర్వకంగా హామీ ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేయడంతో, ఆగస్టు 10లోపు చెల్లిస్తామని రాత పూర్వకంగా కార్మికులకు హామీ పత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లి డిమాండ్లు పరిష్కరించేలా చొరవ చూపుతానని మునిసిపల్ వైస్ చైర్మన్ దోటి సుజాతవెంకటేష్‌యాదవ్ హామీ ఇవ్వడంతో కార్మికులు సమ్మె విరమించారు. కార్యక్రమంలో కార్మికులు అన్నెపర్తి వెంకన్న, నల్లగంటి లింగస్వామి, కత్తుల సైదులు, బిపంగి నాగరాజు, కళమ్మ, అలివేలు, చంద్రమ్మ, ఎల్లమ్మ, రవణమ్మ, జంగమ్మ, ముత్తమ్మ, రజిత, బక్కమ్మ, శ్రీరాములు, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

## సారూ.. డ్రైనేజీ సమస్యను పరిష్కరించరూ..?



సాగర్‌రోడ్‌లో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ

**మిర్యాలగూడటౌన్:** మిర్యాలగూడ పట్టణంలోని సాగర్‌రోడ్డు విస్తరణలో భాగంగా చేపట్టిన డ్రెయిన్ నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో స్థానికులు ఇ బ్బందులు పడుతున్నారు.రోడ్డుకు ఇరువైపులా డ్రైయినేజీ నిర్మించారు. అక్కడక్కడా పైకప్పు వేయలేదు. ఆయా చోట్ల మురుగు నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోందని, దోమలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. పందులు కూడా సంచరిస్తున్నాయని తెలిపారు. బస్టాండు పక్కన, హీరో షో రూం, హనుమాన్‌పేట తదితర ప్రాంతాల్లో పనులు పూర్తికాకపోవడంతో అసౌకర్యానికి గురవుతున్నామని చిరు వ్యాపారులు పేర్కొంటున్నారు. వినియోగదారులు కూడా రావడంలేదని వాపోతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పో యిందని తెలిపారు. మునిసిపల్ పారిశుధ్య విభాగం పనులు నిర్వహణ బాధ్యత తమది కాదని, నిర్మాణ పను లు పూర్తయిన తర్వాత మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారని చిరు వ్యాపారులు తెలిపారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



హాస్టల్‌లో భోజనం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ, జూలై 9:** గురుకుల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. స్థానిక సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలను ఎంఈవో బాలాజీనాయక్‌తో కలిసి మంగళవారం సందర్శించారు. గురుకుల విద్యార్థులకు వడ్డించే అల్పాహారాన్ని పరిశీలించి నాసిరకమైన, పోషక విలువలు లేని అల్పాహారం వండించడంపై అసహనం వ్యక్తం చేశా రు. ప్రతిరోజూ విద్యార్థుకు అందించే మెనూపై వివరణ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. వసతిగృహ పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. టాయిలెట్స్ క్లీనింగ్‌పై నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వసతిగృహ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకో వాలని సూచించారు. పరిసరాల్లో చెత్తాచెదారం వుండటం వల్ల దోమలు వ్యాప్తి చెంది విద్యార్థులు అనారోగ్యం బారిన పడతారని అన్నారు. విద్యార్థులకు మంచి భోజనం, వసతి కలిపిస్తే శారీరక ఎదుగుదలతో పాటు మానసికంగా వృద్ధి చెంది ఆరోగ్యవ ంతమైన పతిభకలిగిన వారిగా తయారుచేయవచ్చునన్నారు. రాజకీయాల కోసం కాదు సామాజిక సేవ కోసమే తాను ప్రజల్లోకి వచ్చానని అన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ మం చిగా చదువుకొని తల్లిదండ్రుల కలలను సాకరం చేయాలని సూచిం చారు. ఏవైనా సమస్యలు ఉంటే తనకు ఫోన్‌ద్వారా చెప్పాలన్నారు.

● మార్కెట్‌కు వచ్చే రైతులకు అసౌకర్యం కలగకుండా చూడాలని ఎమ్మెల్యే బీఎల్ఆర్ సూచించారు. మార్కెట్‌యార్డులో కార్యదర్శి శ్రీధర్, ఉద్యోగులతో మంగళవారం ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డులో మార్పులు చేయాల్సివుందన్నారు. మార్కెట్‌లో ప్రతి మంగళ, శని వారాల్లో నిర్వహించే పశువుల సంతలో సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఉద్యోగులతో మాట్లాడి మార్కెట్ యార్డ్ వివరాలు తెలుసుకున్నారు.

## పదవిలేకున్నా ప్రజా సేవ చేయాలి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

**చండూరు, జూలై 9:** పదవికి మాత్రమే విరమణ ఉంటుందని, ప్రజా సేవకు కాదని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జెడ్పీ టీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచుల పదవీకాలం ముగియడంతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో సన్మానించారు. అధికారంలో లేమని బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు అధైర్య పడవద్దన్నారు. రాష్ట్ర భవిష్యత్ ముమ్మాటికీ బీఆర్ఎస్‌దేనని అన్నారు. రూ.30కోట్లు చండూరు పట్టణంలో రోడ్డు విస్తరణకు తాను ఎమ్మెల్యేగా నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించానని, పనులు ఎందుకు ఆగిపోయాయో ప్రస్తుత ఎమ్మెల్యే సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో కల్లు గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, బీఆర్ఎస్ నాయకులు పాల్వాయి స్రవంతి, మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, మార్కెట్ మాజీ చైర్మన్ గుర్రం మాధవివెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అవ్వారు గీతాశ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ తోకల చంద్రకళ వెంకన్న, నాయకులు బొమ్మరబోయిన వెంకన్న, కొత్తపాటి సతీష్, కౌన్సిలర్లు కోడి వెంకన్న, అన్నెపర్తి శేఖర్, ఉజ్జిని అనిల్‌రావు, ఇడెం కైలాస్ పాల్గొన్నారు.

## రెండు బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు

**కేతేపల్లి, జూలై 9:** నకిరేకల్ పట్టణం, కేతేపల్లి మండలంలోని ఇనుపాముల గ్రామాల మధ్య మూసేసిన యూటర్న్ వద్ద డివైడర్ మీదుగా జాతీయ రహదారి దాటుతున్న బైక్‌ను హైవేపై వెళుతున్న మరో బైక్ ఢీకొంది. ఈ సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సూర్యాపేట మండలంలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన ఎస్‌కె. షరీఫ్ ఎలక్ట్రికల్ పనులు చేస్తూ జీవిస్తుంటాడు. ఈ క్రమంలో ఎలక్ట్రికల్ పని నిమిత్తం మంగళవారం నకిరేకల్ వచ్చిన షరీఫ్ పని ముగించుకుని తన బుల్లెట్ వాహనంపై నకిరేకల్ పట్టణం నుంచి తిప్పర్తి రోడ్డు వద్ద హైవే మీదుగా సూర్యాపేట వైపునకు వెళుతున్నాడు. ఇదే సమయంలో ఇనుపాముల శివారులో మూసేసిన జంక్షన్ వద్ద నకిరేకల్ మండలంలోని మంగళపల్లికి సతీష్ తన బైక్‌తో డివైడర్ మీదుగా హైవేను దాటుతున్నాడు. ఈ క్రమంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. షరీఫ్, సతీష్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు తీవ్రగాయాలైన షరీఫ్‌ను మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

# విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటం




నల్లగొండలో జెండా ఎగురవేస్తున్న ఏబీవీపీ నాయకులు

**నల్లగొండ టౌన్, జూలై 9:** విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ పోరాటాలు చేస్తుందని సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మౌనేశ్వర్ చారి అన్నారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని ఏబీవీపీ ఎంజీయూ శాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యార్థి దినోత్సవం నిర్వహించారు. కళాశాలల్లో మౌలిక వసతులు, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టళ్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పోరాడుతుందన్నారు. అంతకుముందు ప్రొఫెసర్ నవీన్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల సంఘటన కార్యదర్శి అఖిల్‌రెడ్డి, జయందేర్, భాను, శ్రీశైలం, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

**పెద్దఅడిశర్లపల్లి:** ఏబీవీపీ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆదర్శ పాఠశాల విద్యార్థులతో సెమినార్ నిర్వహిం చారు. ఏబీవీపీ విద్యారంగ సమస్యలపై చేస్తుందన్నారు. కార్యక్రమలో నాయకులు కటికల ఈశ్వర్, దామోజీ అమితేష్,శివ, సాయి, అఖిల్, కొండల్ ఉన్నారు.

**మిర్యాలగూడ టౌన్:** ఏబీవీపీ 76వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నారాయణ పాఠశాలలో సంఘం జిల్లా కన్వీనర్ సుర్వి మణికంఠ జెండా ఆవిష్కరించారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి సంఘం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మధుమోహన్‌రాజు, పగిడిపల్లి శ్రీకాంత్, కీర్తి, మల్లీ శ్వరి, నాగేందర్‌రాజు, శ్యాంకుమార్, శ్రీకాంత్, విజయ్, అజయ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

**దేవరకొండ:** ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొండమల్లేపల్లి మండలకేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు ఆకాష్, అఖిల్, హనుమంతు, చిలువేరు మానస, పవన్, అనిల్, పండు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులను నియమించాలి




వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**మిర్యాలగూడ, జూలై 9:** అడవిదేవులపల్లి మండలంలోని బంగారుకుంట తండా పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్, సైదానాయక్ కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆర్డీవోకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. బంగారుకుంటతండా ప్రాథమిక పాఠ శాలలో విద్యార్థులు ఉన్నా ఉపాధ్యాయులు లేకపోవడంతో గిరిజన విద్యార్థులు చదువుకు దూరం కావాల్సి వస్తోందన్నారు. కొన్ని కారణాల వల్ల ఇక్కడి పాఠ శాలలో గతంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను విద్యాధికారులు సస్పెండ్ చేయడంతో వచ్చిన ఇద్దరు ఉపాధ్యాయులు కూడా బదిలీ కారణంగా పాఠశాల నుంచి వెళ్లిపోవడంతో ఉపాధ్యాయులు లేక పాఠశాలకు తాళం వేశారని, పాఠ శాలకు ఉపాధ్యాయులను నియమించకుండా నిర్లక్ష్యం వహించిన అధికారులపై విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వీరన్న, మసీనాయక్, అనిల్, కిరణ్ పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే బాలు



ఎమ్మెల్యే బాలునాయక్‌ను సన్మానిస్తున్న జర్నలిస్టులు

**దేవరకొండ, జూలై 9:** జర్నలిస్టుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే సేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం దేవరకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దేవరకొండ ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ సభ్యులు, జర్నలిస్టులు ఎమ్మెల్యేను కలిశారు. నూతన కమిటీని ఎమ్మెల్యే సన్మానించి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన జర్నలిస్టుందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రెస్‌క్లబ్‌ల నిర్మాణానికి సహాయ, సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వైఎస్ కర్నాకర్, గౌరవ అధ్యక్షుడు గిరిధర్‌రావు, ప్రధానకార్యదర్శి శివప్రసాద్, శ్రీపతిరావు, అంజన్, ఇలియాజ్, విష్ణు, జూలూరి వెంకటయ్య, నారాయణ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

### గ్రామ రెవెన్యూ వ్యవస్థను ప్రవేశపెట్టాలి

**దేవరకొండ, జూలై 9:** వీఆర్‌వోల రద్దుతో గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం గ్రామ రెవెన్యూ వ్యవస్థను ప్రవేశపెట్టాలని వీఆర్‌వోల జేఏసీ జిల్లా అధ్యక్షుడు పగిళ్ల వెంకటయ్య, దేవరకొండ డివిజన్ టీఎన్‌జీవో కార్యదర్శి చేపూరి రామస్వామి కోరారు. దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బాలునాయక్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గ్రామ రెవెన్యూ వ్యవస్థ లేకపోవడం వల్ల సంక్షేమ పథకాల అమలులో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయన్నారు. వీఆర్‌వోలు లేనందున ఖరీదైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు మహేందర్, శ్రీనివాస్‌రెడ్డి, పోలే రామస్వామి, నూనె శ్రీనివాస్, లక్ష్మయ్య ఉన్నారు.

### సీపీఎం సీనియర్ నాయకుడు సోమయ్య మృతి

**నార్కట్‌పల్లి, జూలై 9:** మండలంలోని అవురవాణి గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు ఎట్యాకరి సోమయ్య(75) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. సోమయ్య మృతి పట్ల పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు శ్రీరామోజు వెంకటేశ్వర్లు, పార్టీ మండల కమిటీ సభ్యుడు నీరుడు కృష్ణారెడ్డి, పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి కల్లూరి కంఠమహేశ్వర్, బాలరాజు, లింగయ్య సంతాపం తెలిపారు. మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళలర్పించారు. కాగా సోమయ్యకు కుమారులు లేకపోవడంతో చిన్నకుమార్తె వాణి తలకొరివి పెట్టింది.

### ఎస్ఐ మృతిపై విచారణ జరిపించాలి

**నార్కట్‌పల్లి, జూలై 9:** అశ్వారావుపేట ఎస్ఐ శ్రీనివాస్ ఆత్మహత్య ఘటనపై హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లె పరమేశ్, కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యుడు దండు రవిలు సంయుక్తంగా చేసిన ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్ఐ మృతికి బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

### మంత్రి సీతక్కను కలిసిన నాయకులు

**చిట్యాల రూరల్, జూలై 9:** చిట్యాల మండలం వెల్మినేడుకు చెందిన యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అరూరి శ్రీశైలం మంత్రి ధనసరి సీతక్కను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైద్రాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంత్రిని కలిసి పూలబోకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

### దేవాలయ పునఃనిర్మాణానికి విరాళం



**పెద్దఅడిశర్లపల్లి, జూలై 9:** గుడిపల్లి మండలంలోని పోల్కంపల్లి గ్రామంలో ఈదమ్మ తల్లి దేవాలయ పునః నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా చిలకమర్రి గ్రామ పంచాయతీలోని నీలంనగర్ గ్రామానికి చెందిన సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ నీలం శ్రీనివాస్‌యాదవ్ రూ. 10,116 విరాళాన్ని కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. దాతల సహకారంతో నిర్మిస్తున్న దేవాలయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బోదాసు లక్ష్మయ్య, బోదాసు రాజు, వెంకటయ్య ఉన్నారు.

### మద్యం విక్రయాలు జరిపితే చర్యలు

**దేవరకొండ, జూలై 9:** హోటళ్లు, రెస్టారెంట్లలో మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామ్మూర్తి హెచ్చరించారు. మంగళవారం కొండమల్లేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కొండమల్లేపల్లి పట్టణంలోని హోటల్, రెస్టారెంట్ నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

### రైతుబంధు పెట్టుబడి సాయం జమ చేయాలి

**మర్రిగూడ, జూలై 9:** రైతు భరోసా సరే రైతు సహాయ బంధు ఎక్కడ అని బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు మర్రిగూడ మండల రైతుబంధు మాజీ కన్వీనర్ బచ్చు రామకృష్ణ, రామిడి వెంకటరమణారెడ్డి అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిందని విమర్శించారు. రైతు భరోసాపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేస్తున్నామని చెబుతూ రైతులకు రైతు భరోసా అందించకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. సమావేశంలో యాదయ్య, మదుసూదన్‌రెడ్డి ఉన్నారు.

### సీఎం సహాయనిధి పథకం పేదలకు వరం

**మర్రిగూడ, జూలై 9:** సీఎం సహాయనిధి పథకం పేదలకు వరం లాంటిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య అన్నారు. సీఎం సహాయ నిధి మంజూరైన లెంకలపల్లి, ఇందుర్తి, కొట్టాల గ్రామానికి చెందిన బాధిత లబ్ధిదారులకు మంగళవారం చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో నడికొండ లింగారెడ్డి, చాపల రవి, మాజీ సర్పంచులు లూర్థయ్య, గంట యాదయ్య, రవి, ఎనమల్ల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

### మట్టిని తరలించవద్దని గ్రామస్థుల ఆందోళన

**మాడ్గులపల్లి, జూలై 9:** మండలంలోని గండ్రవానిగూడెం ఇటుక బట్టీలకు వేములపల్లి చెరువు నుంచి మట్టి తరలింపు ఆపాలని గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ఇటుక బట్టీలకు చెరువు మట్టిని ఎక్కువ మొత్తంలో తరించడం వల్ల రోడ్డు అధ్వానంగా తయారైందని, రోడ్డు మీద కుప్పలుగా పడడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఇటుక బట్టీలకు మట్టి తరలింపును నిలిపివేయాలని తమ గ్రామం నుంచి వాహనాలు వెళ్లనియకుండా ఆందోళన చేపట్టారు.

### చట్టాన్ని అమలు చేయాలి

**శాలిగౌరారం, జూలై 9:** సమస్యల పరిష్కారం, రక్షణ కొరకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల చట్టం ప్రకారంగా వ్యవహరించని అధికారులపైన కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపట్టాలని ఆమ్ ఆద్మీ పార్టీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యంపల్ల పురుషోత్తంరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలను అసభ్యంగా, బెదిరింపు ధోరణిలో, దౌర్జన్యంగా వ్యవహరిస్తున్న కొందరు పోలీసులతో వ్యవస్థకే చెడ్డ పేరు వస్తుందన్నారు.

### బాధితులకు ఆర్థిక సాయం

**శాలిగౌరారం, జూలై 9:** అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలో వల్లాల గ్రామానికి చెందిన బింగి వీరయ్యకు రూ.10వేలు, అంబారి పేట మాజీ ఉపసర్పంచ్ మొలుగురి యాకుబ్ రూ.20వేల ఆర్థిక సాయాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిశోర్‌కుమార్ ద్వారా బీఆర్ఎస్ మండల పార్టీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్, కట్ట వెంకట్‌రెడ్డి, దుబ్బ వెంకన్న, మామిడి రమేష్, పనికర కమలాకర్, రాచకొండ గణేష్ పాల్గొన్నారు.